క్లుప్తంగా

చేనేత కార్మికులకు ప్రభుత్వం అండ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చేనేత కార్మికులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన వాడపల్లి త్రిమూర్తులు పార్టీ జిల్లా అధ్యక్షులు వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా త్రిమూర్తులను వెలంపల్లి సత్కరించారు. పార్టీ నాయకులు తంగెళ్ల రామచంద్రరావు, అత్తులూరి పెదబాబు, అయితా కృష్ణకిషోర్, కొల్లి మాణిక్యాలరావు, జాగు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయినాధుని చందనోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని సాయినాధుని చందనోత్సవ మహోత్సవం గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. మేళతాళాలు, భక్తుల సాయినాధుని సంకీర్తనల మధ్య చందనోత్సవ ఊరేగింపు ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ భక్తులకు మధురానుభూతులను అందించాయి. కొత్తపేట గణపతిరావురోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ పండరి సాయి మందిరం ఆధ్వర్యంలో శ్రీరామనవమి చందనోత్సవ ఊరేగింపు కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా మేళతాళాలతో, భక్తుల సాయి నామ స్మరణల మధ్య బాబా చందనోత్సవపు ఊరేగింపు విశేషంగా జరిగింది. సోమవారం సాయంత్రం జరిగిన బాబా చందనోత్సవం ఆలయం నుంచి ప్రారంభమై గణపతిరావు రోడ్డు, కుమ్మరివీధల మీదుగా తిరిగి మందిరానికి చేరింది. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త నాగోతి వెంకట రామకృష్ణ పర్యవేక్షించారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ):శ్రీరామనవమి పండుగ సందర్భంగా భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరం పాలకమండలి ఆధ్వర్యంలో గురువారం రాత్రి కాలనీ పురవీధుల్లో షిర్డీ సాయిబాబా చందనోత్సవ ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు సాయిబాబాకు సమర్పించిన చందనానికి నమస్కరించి తమ అభీష్టం నెరవేరాలని కోరుకుంటూ తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ పాలకమండలి అధ్యక్షులు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, ఇ వెంకట రమేష్, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పీవీ లక్ష్మీ ప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, పలువురు సాయి సేవకులు పాల్గొన్నారు.

ఘనంగా నగరోత్సవం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):రాయప్పరాజు వీధిలోని లక్ష్మీ నరసింహస్వామి, దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో సీతారామ స్వామి వారి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని తొలుత సీతారామ లక్ష్మణ , వీరాంజనేయ స్వామి వార్ల విగ్రహాలను ఆలయ కమిటీ నగరోత్సవాన్ని నిర్వహించారు. అధ్యక్షుడు శ్యామ్‌రాజ్, టి.దుర్గారావులు స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాన్ని ఆలయానికి చెందిన సాంబ, నాగబాబు, చిన్ని, నాని, మహేష్‌లతో పాటు కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కౌలు రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కౌలు రైతులకు నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం పండించిన రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని, అలాగే అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టపరిహారాన్ని కౌలు రైతులకే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. క్రాఫ్ ఇన్సూరెన్స్‌ను గ్రామ యూనిట్‌గా నిర్ణయించి పంటలు దెబ్బతిన్న వారికి ఇన్సూరెన్స్ వర్తింపచేయాలని తెలిపారు. ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణోత్సవం

- వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు
- ఆధ్యాత్మిక శోభతో కళకళలాడిన రామాలయాలు



నగరాల రామాలయంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సీతారాముల కల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, పండితుల వ్యాఖ్యానాలు, భక్తుల శ్రీరామ నామ నినాదాల మధ్య స్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. వన్‌టౌన్ కోమలవిలాస్ సెంటర్‌లోని నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేంచేసి ఉన్న స్వామి వారిని భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఆరుబయట ప్రత్యేక వేదికపై సీతాలక్ష్మణ సమేత శ్రీరాముని ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. కమిటీ ప్రముఖులు లింగిపల్లి అప్పారావు, బెవర సూర్యనారాయణ, మరుపిళ్ల హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావు తదితరులు స్వామి వారికి ముత్యాలతలంబ్రాలను సమర్పించారు. స్థానిక శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు మేయర్ రాయన భాగ్యలక్ష్మీలు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. రాంపిళ్ల మహేశ్వరరావు దంపతులు ఉభయ దాతలుగా కూర్చొని కల్యాణోత్సవం నిర్వహించారు.

కొత్తగుళ్లు ప్రాంగణంలో వేంచేసి ఉన్న కోదండరామస్వామి వారి దేవస్థానంలో ఆగమ పండితుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా చేశారు. సాయంత్రం స్వామి వారికి గరుడసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవంలో వెలంపల్లి శ్రీనివాసరావు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు నిర్వహించారు.

భావనారాయణవీధిలో వేంచేసి ఉన్న కోదండరామ స్వామి వారి దేవస్థానంలో కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రముఖులు కేఏ ల్వీ మోహనరావు పర్యవేక్షించారు.

పంజా సెంటర్ సమీపంలోని మహేశ్వరి ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామి కల్యాణోత్సవం వైభవంగా చేశారు. వస్త్రలత ప్రాంగణంలో వేంచేసి ఉన్న కోదండరామస్వామి సన్నిధిలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. కొత్తపేట సైకంవారివీధిలో వేంచేసి ఉన్న రామాలయంలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి హనుమత్‌వాహనోత్సవాన్ని నిర్వహించారు. పాతబస్తీలోని బెజవాడ బులియన్ అండ్ జ్యూయలరీ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివాలయం వీధిలోని రామాలయంలో స్వామి వారి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు శ్రీహరి తదితరులు పూజలు నిర్వహించారు.

కమనీయం.. రాములోరి కల్యాణం

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం గట్టు వెనుక ప్రాంతంలో వాడవాడలా నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవాలు కమనీయంగా జరిగాయి. మానవ లోకంలో విలువలు, వ్యక్తిత్వం కాపాడేందుకు అవతరించిన ఆదర్శ పురుషుడు శ్రీరాముడి కల్యాణాన్ని పలు దేవాలయాల్లో, వివిధ సంస్థల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని కొట్టేటి కోటయ్య వీధిలోగల రామాలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, కమిటీ సభ్యులు కర్రి మల్లికార్జునరావు, పేడాడ రామచంద్రరావు, దాసరి శేఖర్, చిన్నా, బడుగు చిన్న, పేడాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు. విద్యాధరపురం ఆర్కే పబ్లిక్ స్కూల్ రోడ్‌లో శ్రీరామ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీసీతారామచంద్ర కల్యాణ మహోత్సవంలో పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కల్యాణ దంపతులకు పట్టు వస్త్రాలు బహూకరించారు. అన్నప్రసాద వితరణ కైంకర్యాన్ని గుడివాడ రామకృష్ణ-గంగాదేవి, 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ-అంజని దంపతులు నిర్వహించారు. ఈ వేడుకల్లో జూలూరు నాగభూషణం, సంకా వెంకట హరగోపాల్, సముద్రాల పుల్లారావు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు పల్లపోతు మురళీకృష్ణ (కొండపల్లి బుజ్జి), విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు. భవానీపురం బ్యాంక్ సెంటర్‌లోని దాసాంజనేయస్వామి గుడి, హనుమయ్య వీధిలోగల హనుమాన్ టెంపుల్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని ఆంజనేయస్వామి గుడిలో జరిగిన కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. విద్యాధరపురం చెరువు సెంటర్, లేబర్‌కాలనీలో జరిగిన రాములోరి కల్యాణ మహోత్సవంలో 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు పాల్గొన్నారు.



శ్రీరామ వాసవి సేవా సమితి కల్యాణోత్సవంలో పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న వెలంపల్లి, మేయర్



కల్యాణం జరిపిస్తున్న సీపీ టీకే రాణా దంపతులు

సీతారామ కల్యాణంలో సీపీ దంపతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా విజయవాడ బందర్ రోడ్‌లోని పోలీస్ క్వార్టర్స్‌లోగల సాయుధ రిజర్వ్ పోలీస్ రామాలయంలో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా దంపతులు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలుకగా పోలీస్ కమిషనర్ దంపతులు సంప్రదాయ పద్ధతిలో స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహ మూర్తులకు వైభవంగా కల్యాణం చేశారు. డీసీపీలు విశాల్ గున్నీ, ఏబీటీఎస్ ఉదయరాణి, మోకా సత్తిబాబు (అడ్మిన్), కె శ్రీనివాసరావు (ట్రాఫిక్), బీ రామకృష్ణ (సీఎస్‌డబ్ల్యు), సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ సీహెచ్ లక్ష్మీపతి, క్రైమ్ ఏడీసీపీ పీ వెంకటరత్నం, ఏఆర్ ఏడీసీపీ కె శ్రీనివాసరావు, ఏసీపీలు జీవీ రమణమూర్తి, వీఎస్ వాసన్, చెంచిరెడ్డి, పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):శ్రీరామనవమి సందర్భంగా వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామారంగంచౌక్ సెంటర్‌లో కల్యాణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వ్యాపారులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సంస్థ చైర్మన్ వీవీకే నరసింహారావు నిర్వహించగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొనిజేటి రమేష్, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల ట్రేడ్ యూనియన్ కోఆర్డినేటర్ నంబూరి ప్రదీప్; మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి రసభరితం రామచరిత గానం

విజయవాడ కల్చరల్: శ్రీరామనవమి సందర్భంగా ఆంధ్ర జింఖానా క్లబ్, తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ జింఖానా క్లబ్ ఆవరణలోని కళావేదికపై గురువారం నిర్వహించిన రామ చరితా గానం భక్తిగా సాగింది. చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు మల్లాది స్వాతి, కొండేటి దుర్గానాగమణి కొండలరావు, భాస్కరరావు, మోహన్‌రావు, మస్తాన్‌వలి, డేవిడ్‌రాజు తెలుగు సినిమాల్లో రామచరితను వివరించిన లవకుశ, శ్రీ రామరాజ్యం, సంపూర్ణ రామాయణం, శ్రీ రామకథ తదితర చిత్రాల్లోని పాటలతోపాటు లలిత గీతాలను ఆలపించారు. గోళ్ళ నారాయణరావు, శ్యాంప్రసాద్, చీదెళ్ళ నాగేశ్వరరావు, శింగంశెట్టి పెద బ్రహ్మం పాల్గొన్నారు. జింఖానా క్లబ్ సభ్యులు గాయనీ గాయకులను సత్కరించారు.



స్వర్ణకవచాలంకారంలో కొత్తగుళ్లు ప్రాంగణంలోని కొలువై ఉన్న కోదండరాముడు



భావనారాయణవీధిలో కోదండరాముని కల్యాణం



కొత్తగుళ్ళులో స్వామి వారి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి




హాజరైన భక్తులు



చిత్ర గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు



వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం



కొట్టేటి కోటయ్య వీధిలోని రామాలయంలో పూజలందుకున్న సీతారాములు



బెజవాడ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం

సామాజిక చైతన్యానికి కళలు దోహదం



కార్యక్రమంలో విద్యార్థుల అభినయం

గుణదల (విజయవాడ తూర్పు): కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా లలిత కళల్లో విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆంధ్రలయోల ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్ జేవియర్ అన్నారు. కళాశాల ఆవరణలో అభినయ - 2023 కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారత దేశ సంస్కృతి సంప్రదాయాలలో లలిత కళలకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. సామాజిక చైతన్యానికి కళలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. సంగీతం, సాహిత్యం, రచన, అభినయం వంటి అంశాల్లో విద్యార్థులు అభిరుచి కలిగి నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పొందించేందుకు తమ కళాశాల పలు కార్యక్రమాలను రూపొందిస్తుందని వివరించారు. దీనిలో భాగంగా అభినయ - 2023 కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సెల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, పర్యావరణ పరిరక్షణ, వంటి అంశాలను ముఖాభినయం ద్వారా ప్రదర్శించి చక్కని ప్రతిభ కనబరిచారని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ రవీంద్ర, ప్రిన్సిపల్ ఓ.మహేష్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం

- 18వ డివిజన్‌లో రూ.90 లక్షలతో నిర్మాణం
- త్వరలో తీరనున్న రాణిగారితోట ప్రజల చిరకాల స్వప్నం



రాణిగారితోటలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు

కృష్ణలంక(విజయవాడతూర్పు):రాణిగారితోటలోని 18వ డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నగర పాలక సంస్థ నుంచి సుమారు. రూ.90 లక్షల నిధులు మంజూరవడంతో రెండు అంతస్తుల నిర్మాణ పనులు చకచకా కొనసాగుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివసించే రాణిగారితోట ప్రాంతంలో శుభకార్యాలు చేసుకునేందుకు సరైన సదుపాయాలు లేక స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ కల్యాణ మండపాలను ఆశ్రయించలేక రోడ్లపైనే శుభకార్యాలు నిర్వహించుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సహకారంతో స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి నగర పాలక సంస్థ నుంచి సుమారు రూ.90 లక్షలు మంజూరు చేయించారు. స్థానిక ప్రజల చిరకాల స్వప్నమైన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు శరవేగంగా సాగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు.

త్రిశక్తి పీఠంలో తామర పూలతో అర్చన



తామర పూలతో అర్చనలు అందుకున్న మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ ఉత్సవ విగ్రహాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు):శోభకృత్ నామ సంవత్సర వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో గురువారం మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లకు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు 1001 తామర పూలతో విశేషంగా అర్చన నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు. ఆలయ ఆధ్యాత్మిక సలహాదారుడు బి.హెచ్. విజయ్‌కిరణ్, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.జగదీష్, జి.పుల్లయ్య, ఆలయ సూపరింటెండెంట్ మధుసూధనరావు, సభ్యుడు జి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

వేసవి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని కొత్తపేట పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం అన్నారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా చిట్టినగర్ కలరా హాస్పటల్, సాయిరాం సెంటర్‌లో మీనాక్షి కన్‌స్ట్రక్షన్స్ అధినేత పెద్ది రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సీఐ సుబ్రహ్మణ్యం గురువారం ప్రారంభించారు. సింహాచలం దేవస్థానం పాలకమండలి సభ్యుడు కూరాకుల నాగ, బీజేపీ నాయకులు బీఎస్ పట్నాయక్, చిట్టినగర్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నల్లబెల్లి శ్రీనివాస్, యేసు, బెవర సూరిబాబు, కత్తెర రమేష్ తదితరులు పాల్గొని పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

భవన నిర్మాణ కార్మికులకు బియ్యం పంపిణీ



భవననిర్మాణ కార్మికులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఏసీపీ ఖాదర్‌బాషా

ఆటోనగర్(విజయవాడతూర్పు):కనకదుర్గ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు 200 మందికి విజయవాడ సెంట్రల్ ఏసీపీ ఎస్‌కె ఖాదర్‌బాషా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ ఖాదర్‌బాషా మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. భవననిర్మాణ కార్మికులు రోజువారి పనుల నిమిత్తం బెంజిసర్కిల్ వద్ద ఉంటారని... వీరిని గుర్తించి సహాయం చేయడం మరువరానిదన్నారు. ఒక్కొక్కరికి 10 కేజీలు బియ్యం అందించామన్నారు. ఫైనాన్స్ కంపెనీ ఎండీ వీజీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో శుక్రవారం నుంచి ఏప్రిల్ ఎనిమిదో తేదీ వరకూ వసంత నవరాత్రి సహిత కల్యాణ పుష్పయాగ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.హేమలతాదేవి తెలిపారు. ఏటా చైత్రమాసంలో వసంత రుతువును పురస్కరించుకొని స్వామి వారి సన్నిధిలో వసంతనవరాత్రులను నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. స్వామివారిని పెళ్లికుమారునిగా చేయుట, విఘ్నేశ్వరపూజ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణం, సర్వదేవతల ఆహ్వానం, ఒకటో తేదీ ఉదయం సాయంత్రం నిత్య ఔపసన, బలహరణలు, రెండున తేదీన సాయంత్రం ఎదుర్కోల ఉత్సవం, మూడున శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం, నాలుగున నిత్య ఔపోసన, బలిహరణలు, ఐదో తేదీన వసంతోత్సవం, పూర్ణాహుతి, దొంగలదోపు ఉత్సవం ధ్వజావరోహణంతదితర కార్యక్రమాలుంటాయని వివరించారు. అదేవిధంగా ఆరో తేదీన ద్వాదశ ప్రదక్షణలు, స్వామి వారి ఏకాంత సేవ, ఏడు, ఎనిమిది తేదీల్లో స్వామి వారికి ఏకాంత సేవ, ఇతర వైదిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై మృతుడి అక్క ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. చిట్టినగర్ పెండెం రాములు వీధికి చెందిన గాయపోటి దుర్గా వెంకట ప్రసాద్ (40)కు వివాహం కాగా ఇద్దరు సంతానం. వెంకట ప్రసాద్ భార్యతో విభేదాల కారణంగా అమె ఇద్దరి పిల్లలతో తన పుట్టింట్లో ఉంటుంది. దీంతో భర్త ఒంటరిగా ఉంటున్నాడు. భార్య పిల్లలు తనతో లేరని అనేక సార్లు మదన పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీన వెంకట ప్రసాద్ పురుగుల మందు తాగాడు. అదే భవనంలో కింద పోర్షన్‌లో ఉండే మేనల్లుడు భవానీ ప్రసాద్ ఈ విషయం గురించి తల్లి దుర్గాదేవికి చెప్పడంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వెంకట ప్రసాద్ బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్తపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన బంకా లక్ష్మీ టైలరింగ్ పనిచేస్తుంది. భర్త వీరయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరయ్య నిత్యం మద్యం తాగి భార్యను అనుమానించి వేధిస్తున్నాడు. తరచూ కొడుతూ ఉండడంతో గతంలో పలు పర్యాయాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గొడవలు లేకుండా కాపురం చేసుకుంటామని అంగీకరించి, తిరిగి ఎప్పటిలాగే వేధింపులు ప్రారంభించాడు. ఈ నేపథ్యంలో గురువారం మద్యం తాగి వచ్చి భార్యను కొట్టాడు. అడ్డువచ్చిన అత్త దేవర లక్ష్మమ్మ, పిల్లలను కొట్టాడు. దీనిపై బంకా లక్ష్మీ ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టెన్త్ విద్యార్థులకు పెన్నులు పంపిణీ

ఆటోనగర్(విజయవాడతూర్పు):కానూరులోని అన్నె శివనాగేశ్వరరావు, అరుణకుమారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులు విద్యార్థులు 120 మందికి స్కూల్ కన్వీనర్ అన్నె శివనాగేశ్వరరావు పెన్నులు, ప్యాడ్‌లు, ఎరైజర్లు పంపిణీ చేశారు. ఆటోనగర్ జమాక్ మాజీ డైరెక్టర్ కత్తిక శివనాగేశ్వరరావు, ఐలా మాజీ చైర్మన్ ఎస్.దుర్గాప్రసాద్, చంద్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.